

భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాలమ్మ అమ్మవారికి విశేషపూజలు చేపట్టారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: ఆలయ దక్షిణ మాడవీధిలో నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన భాస్కర డాన్స్ అకాడమీ వారిచే ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం భక్తులను ఆకట్టుకుంది.



'ఉపాధి'లో అక్రమాలకు చెక్!

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పడింది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్‌ను అమలు చేసి, ఆధార్ అనుసంధానంతో కూలీలకు వేతనాలు చెల్లిస్తున్నారు.

8లో▸

న్యూస్‌రీల్

విజయ డెయిరీ అభివృద్ధే లక్ష్యం



సోలార్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్న విజయ డెయిరీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): విజయ డెయిరీ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక డెయిరీ ఆవరణలో శుక్రవారం రూ. 3.5 కోట్ల వ్యయంతో 600 కేడబ్ల్యూపీ సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతో డెయిరీకి రూ.7 లక్షలు ఆదా అవుతుందన్నారు. ఏటా డెయిరీకి వచ్చిన ఆదాయంలో లీటర్‌కు రూపాయి పెంపుతో బోనస్‌ను ఇస్తున్నామన్నారు. ఇటీవల అమరావతిలో సీఎం చేతుల మీదుగా పాడిరైతులు, డెయిరీ సిబ్బందికి రూ.7.20 కోట్ల బోనస్ అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎండీ పరమేశ్వరరెడ్డి, ఓఎస్‌డీ ప్రదీప్‌కుమార్, డీడీ రాజేష్, డీజీఎం విశ్వనాథ్, వెంకటేశ్వర్లు, రాంమోహన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మందులతోనే క్షయ నయం



వైద్య సిబ్బందికి సూచనలు అందజేస్తున్న టీబీ యూనిట్ జిల్లా అధికారి మల్లికార్జున రెడ్డి

కోవెలకుంట్ల: క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందని టీబీ యూనిట్ జిల్లా అధికారి మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని టీబీ రోగుల సంఖ్య, వారికి అందుతున్న మందుల వివరాలను డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభానిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాన్పుల గది, నాడు– నేడు కార్యక్రమం ద్వారా జరుగుతున్న ఆసుపత్రి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాతా, శిశు మరణాల శాతాన్ని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, గిరిజ, ప్రభావతి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మల్లన్న దర్శన వేళలో మార్పులు



శ్రీశైలంటెంపుల్: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధనుంజయ వై.చంద్రచూడ్ శ్రీశైలం పర్యటన నేపథ్యంలో ఆదివారం దర్శన వేళల్లో మార్పులు చేసినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న తెలిపారు. 26వ తేదీ ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనాలు, స్వామి వారి స్పర్శదర్శనం టికెట్లు (రూ.500) నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఉదయం 6.30 గంటలకు నిర్వహించే సామూహిక అభిషేకాలు కూడా నిలుపుదల చేశామన్నారు. మధ్యాహ్నం 11.45 గంటలకు వీఐపీ బ్రేక్, 12.30 గంటలకు స్పర్శదర్శనాలు (రూ.500), సామూహిక అభిషేకాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

సీబీఎస్ఈ 'పది' పరీక్షలు ప్రారంభం




పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో సుమారు 2,200 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. కర్నూలు నగరంలోని ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాల, ఎస్ఆర్ పేటలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్చి 21 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

అగ్నిపథ్ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ ఆర్మీలో అగ్నిపథ్ నియామకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్కూరు సీఈఓ పీవీ. రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 17 నుంచి గుంటూరు జోన్‌లోని 13 జిల్లాల యువతకు ఎంపిక కార్యక్రమం ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈ నెల 16 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు httpr://ojinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పోస్టుల వివరాలు, విద్యార్హత, ఇతర అర్హత వివరాలు ఆన్‌లైన్‌లోనే ఉంటాయని పేర్కొన్నారు.



జీఎన్ఎస్ఎస్ కాలువ (ఫైల్)

వరద నీరు ఒడిసిపట్టి.. కరువుకు ముకుతాడేసి!

రూపుదిద్దుకుంటున్న 'మల్లికార్జున రిజర్వాయర్'

- 15.7 టీఎంసీల సామర్థ్యంతో దేవనూరు వద్ద నిర్మాణం
- జలకనూరు వద్ద జీఎన్ఎస్ఎస్ ద్వారా వరద జలాల ఎత్తిపోత
- ఐదు నియోజకవర్గాల్లో 2లక్షల ఎకరాలకు సాగునీరు
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- డీపీఆర్‌కు రూ.1.99కోట్లు విడుదల

శ్రీశైలానికి వరద ప్రవాహం ఉన్నప్పుడు కరెంటు ఉత్పత్తి పేరుతో తెలంగాణ కోటాకు మించి నీటిని వాడుతోంది. సాగు, తాగునీటి సమస్యతో జిల్లాలోని పశ్చిమ ప్రాంతం అల్లాడుతోంది. ఈ పరిస్థితుల్లో 15–20 టీఎంసీల సామర్థ్యంతో ఓ రిజర్వాయర్ నిర్మించి వరద జలాలను నిల్వ చేస్తే ఈ ప్రాంతానికి మేలు జరుగుతుందనే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 'మల్లికార్జున రిజర్వాయర్' పేరిట ఓర్వకల్లు వద్ద నిర్మించనున్న రిజర్వాయర్‌తో ఐదు నియోజకవర్గాల్లో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు కర్నూలు నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుండటం విశేషం.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతం తరాలుగా కరువుతో అల్లాడుతోంది. వర్షాధారం కావడంతో కలిసిరాని వ్యవసాయం.. తప్పని వలసలు.. మెరుగుపడని జీవన విధానం.. వెక్కిరిస్తున్న పేదరికం.. వెరసి ఇక్కడి ప్రజల కంట్లో కన్నీటి సుడి సర్వసాధారణమైంది. ఓదార్పు యాత్ర.. రైతు భరోసా యాత్ర.. పాదయాత్రల సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ బాధలను ప్రత్యక్షంగా వీక్షించారు. ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి అయ్యాక శాశ్వత కరువు నివారణ దిశగా అధ్యయనం చేయించారు. ఆ మేరకు జలవనరుల శాఖ అధికారులు 'మల్లికార్జున రిజర్వాయర్'ను పరిష్కార మార్గంగా సూచించారు.

డీపీఆర్‌కు రూ.1.99కోట్లు

కృష్ణానది నుంచి జీఎన్ఎస్ఎస్(గాలేరు నగిరి సుజల స్రవంతి) కాలువ వెళ్తోంది. జలకనూరు గ్రామం వద్ద జీఎన్ఎస్ఎస్ నీటిని ఎత్తిపోస్తారు. ఆరు కిలోమీటర్ల వరదకాలువ ఏర్పాటు చేసి, మిడుతూరు మండలం దేవనూరు వద్ద 15.7 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించనున్నారు. ఇందులో జీఎన్ఎస్ఎస్ నుంచి 13.2టీఎంసీలు.. సమీప వాగుల ద్వారా వర్షం నీరు ఏటా 2.5 టీఎంసీలు లభ్యమవుతుంది. రిజర్వాయర్ పూర్తయితే 20టీఎంసీల వరకు నిల్వ చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదంతా ఫేజ్–1 మాత్రమే. 'మల్లికార్జున రిజర్వాయర్' పేరుతో నిర్మించే ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. డీపీఆర్(డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) సిద్ధం చేయాలని రూ.1.99కోట్లను విడుదల చేస్తూ ఈ నెల 7న ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ జీవో 61 జారీ చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1500కోట్లు ఖర్చవుతుందని అంచనా.



మినీ రిజర్వాయర్లు, లిఫ్ట్‌లతో సస్యశ్యామలం

ఓర్వకల్లు రిజర్వాయర్ నుంచి ఐదు నియోజకవర్గాలకు నీరు తరలించేలా లిఫ్ట్‌లు, మినీ రిజర్వాయర్‌లు నిర్మించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఫేజ్–2లో ఈ నిర్మాణాలు ఉండనున్నాయి. సాగునీటి వనరులు పెద్దగా లేని పశ్చిమ ప్రాంతంలో వీటి నిర్మాణం ద్వారా వీలైనంత ఆయకట్టుకు సాగునీరు అందించే వీలుంది. అలాగే 10,900 ఎకరాల్లో చేపట్టిన ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు కూడా 3.5 టీఎంసీల నీటిని అందించనున్నారు. దీంతో సాగు, తాగునీటితో పాటు పారిశ్రామిక అవసరాలకు నీటి సమస్య తీరనుంది. ఈ ప్రాజెక్టు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ముఖ్యమంత్రి అభినందనలు అందుకుంది.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ప్రాజెక్టు గురించి ముఖ్యమంత్రికి వివరించగానే డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు నిధులు కూడా విడుదల చేశారు. డీపీఆర్ సిద్ధం కావడం, దాన్ని ప్రభుత్వం ఆమోదించి టెండర్లు పిలవడమే తరువాయి. ప్రాజెక్టు పూర్తయితే ఇక్కడి ప్రజల బతుకుల్లో మార్పు వస్తుంది. పంటల సాగుతో ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుంది.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే, పాణ్యం

మూడు నెలల్లో డీపీఆర్ సిద్ధం

మల్లికార్జున రిజర్వాయర్‌తో సాగు, తాగునీటికి శాశ్వత పరిష్కారం దొరికినట్లే. పైగా తక్కువ ఖర్చుతో ఎక్కువ నీటిని నిల్వచేసే ప్రాజెక్టు ఇది. సాధారణంగా ఒక టీఎంసీకి రూ.300–400కోట్లు ఖర్చవుతుంది. 3టీఎంసీలతో నిర్మించే వేదవతికి రూ.2వేల కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఆర్‌డీఎస్, నిప్పులవాగుతో పాటు అన్ని ప్రాజెక్టులకూ ఖర్చు ఎక్కువే. అయితే ఇక్కడ మాత్రం రూ.1500కోట్లతో 15.7 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించనున్నారు. మే ఆఖరుకు డీపీఆర్‌ను ప్రభుత్వానికి అందజేస్తాం.

– కిష్టన్న, డీఈ, నీటిపారుదల శాఖ

ఐదు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు



రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతం

- ప్రాజెక్టు నిర్మాణానికి ఓర్వకల్లు, బేతంచర్ల మండలాల పరిధిలో 12వేల ఎకరాల భూమి సేకరణ.
- శకునాల సోలార్‌ప్లాంటు పరిధిలో అదనంగా మరో 600 ఎకరాలు.
- కృష్ణా నదికి వరద ప్రవాహం ఉన్నప్పుడు 40–50రోజుల పాటు నీటి ఎత్తిపోత.
- రోజుకు 0.3 టీఎంసీల చొప్పున 13.7 టీఎంసీలు తరలించేలా ప్రాజెక్టు నిర్మాణం.
- నందికొట్కూరు మండలం మిడుతూరు, పాణ్యం, డోన్, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందనుంది.
- కర్నూలు నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం.
- అవసరమైతే వైఎస్సార్ జిల్లాకూ తాగునీటి సరఫరా.

ఉగాది ఉత్సవాల బందోబస్తుకు కర్ణాటక పోలీసులు

- సిఫారసు చేయాలని ఈఓకు జగద్గురు పీఠాధిపతి సూచన



శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది ఉత్సవాల బందోబస్తుకు కర్ణాటక పోలీసులు విధులు నిర్వహించేలా ఆ ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ఈఓ లవన్నకు సూచించినట్లు జగద్గురు పీఠాధిపతి డా.చెన్నసిద్ధరామ శివాచార్య మహా స్వామీజీ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక జగద్గురు సత్రం అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. దేవస్థానం ఈఓ, జిల్లా ఉన్నతాధికారులు సమన్వయంతో వ్యవహరించి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేశారన్నారు. వచ్చే నెలలో నిర్వహించే ఉగాది ఉత్సవాలకు కర్ణాటక నుంచి భారీగా తరలి వచ్చే కన్నడీగుల భద్రతకు నంద్యాల జిల్లా ఎస్పీతో పాటు కర్ణాటక పోలీస్ ఉన్నతాధికారులతో కూడా చర్చించి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులు సామరస్యంతో వ్యవహరించి ప్రశాంత వాతావరణంలో స్వామిని దర్శించుకోవాలని సూచించారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి రాక

కర్నూలు(రాజ్‌విహార్): శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటలకు కర్నూలులోని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నివాసంలో నిర్వహించే సమావేశానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరుకానున్నారు. ఆయనతో పాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు హాజరుకానున్నారు. పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్లు ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి హాజరవుతున్నట్లు పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య తెలిపారు.



శుక్రవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ

నంద్యాల: పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌పై నిర్వహించిన మొదటి శిక్షణా తరగతుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా పూర్తిస్థాయి శిక్షణ పొందాలని ఆదేశించారు. జిల్లాలో పట్టభద్రలకు సంబంధించి 61 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు సంబంధించి 30 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అనుమానాలు ఉన్న మాస్టర్ ట్రైనర్లచే సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. రెండు విడతల పాటు శిక్షణనిచ్చిన అంశాలపై మూడవ విడత శిక్షణలో పోలింగ్ ప్రక్రియపై టెస్టులు నిర్వహిస్తామన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు వచ్చిన సంబంధిత అధికారులపై తీవ్ర కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎస్సార్బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మాస్టర్ ట్రైనర్ కామేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీని రెండు రోజుల్లో పూర్తి చేయండి

రబీ పంట కాలానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీని రెండు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతితో కలిసి జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ రబీ పంట కాలానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న లక్ష ఎకరాల ఈ క్రాప్ బుకింగ్‌ని సోమవారం నాటికి పూర్తి చేయాలన్నారు. అలాగే పీఎం కిసాన్ కింద పెండింగ్‌లో ఉన్న 40,326 మంది రైతుల ఈ కేవైసీని 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఉయ్యాలవాడ, పగిడ్యాల, నందికొట్కూరు, సంజామల మండలాల్లో మందకొడిగా ఎందుకు ఉందని ఏడీఏలను ప్రశ్నించారు. మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖల ద్వారా రైతుల నుంచి జొన్న, శనగ పంటలను మద్దతు ధరపై కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో డీఏఓ మోహన్ రావు, ఇరిగేషన్, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ, ఏపీఎంఐపీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజేఐ పర్యటనకు ఏర్పాట్లు చేయండి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధనుంజయ వై. చంద్రచూడ్ ఈనెల 25, 26 తేదీలలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం శ్రీశైలం విచ్చేస్తున్న సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సీజేఐ పర్యటన ఏర్పాట్లపై ఎస్పీ రఘువీర్ రెడ్డి, జేసీ టి. నిశాంతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సున్నిపెంట హెలిప్యాడ్ మైదానాన్ని సిద్ధం చేసి, కాన్వాయ్ వెంట కండీషన్‌తో ఉన్న 12 వాహనాలను అందుబాటులో ఉంచాలని జిల్లా రవాణా అధికారులను ఆదేశించారు. సీజేఐతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హైకోర్టు న్యాయమూర్తులు, వివిధ జిల్లాల జడ్జిలు శ్రీశైలం వస్తున్న సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ పుల్లయ్య, ఆర్అండ్‌బీఎస్ఈ శ్రీధర్ రెడ్డి, ఆర్డీఓలు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, దాసు పాల్గొన్నారు.

'స్థానిక' బరిలో ముగ్గురు

- ఒక నామినేషన్ తిరస్కరణ

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ముగ్గురు అభ్యర్థులు నిలిచారని, ఒక నామినేషన్‌ను తిరస్కరించామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు (స్థానిక సంస్థల నియోజకవర్గం) సీనియర్ ఐఏఎస్ అధికారి ఎం.ఎం.నాయక్ పర్యవేక్షణలో నామినేషన్ పత్రాల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు నలుగురు అభ్యర్థులు ఆరు నామినేషన్లను దాఖలు చేశారన్నారు. అందులో ఇండిపెండెంట్ అభ్యర్థి కుమ్మరి శ్రీనివాసులు నామినేషన్ పత్రాలు సక్రమంగా లేని కారణంగా తిరస్కరించినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎ.మధుసూదన్, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎస్.మోహన్‌రెడ్డి, భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి నామినేషన్లు సక్రమంగా ఉన్నాయన్నారు.



'జోడు' వైభవం

ఆలూరు: ఓంకార నాదాలు.. శంఖా ధ్వానాలు.. వేదమంత్రోచ్ఛారణలు.. మంగళవాయిద్యాల మధ్య శ్రీ శరణ గాదిలింగప్ప తాత జోడు రథోత్సవం శుక్రవారం హాలహర్వి మండలం గూళ్యంలో అత్యంత వైభవంగా సాగింది. శాస్త్రోక్తంగా ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించి..జోడు రథాలపై అధిష్టింపజేశారు. అనంతరం తాత దేవాలయం నుంచి బసవన్న గుడివరకు భక్తి శ్రద్ధలతో రథాలను లాగారు. వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మూడు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులందరికీ స్వామి దర్శనం కల్పించారు. ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ నేతృత్వంలో 8 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 250 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈఓ రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ రఘునందన్‌గౌడ్, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బజారప్ప, పూజారి మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

వచ్చాడయ్యో సామి..!

- కొండ చేరిన అహోబిలేశులు
- ముగిసిన పార్వేట

ఆళ్లగడ్డ: తన వివాహ మహోత్సవ వేడుకల (బ్రహ్మోత్సవాల)కు సకుటుంబ సపరివార సమేతంగా తరలిరావాలని అహోబిలేశుడు 41 రోజుల పాటు 33 గ్రామాల భక్త జనాన్ని ఆహ్వానించి శుక్రవారం దిగువ అహోబిలం చేరుకున్నారు. పార్వేట మహోత్సవాలు ముగించుకుని తిరిగి తన నివాస క్షేత్రానికి చేరుకున్న శ్రీ జ్వాల నృసింహ స్వామి, ప్రహ్లాదవరద స్వామికి అహోబిలం మఠం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్, వేద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామి అహోబిలం చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామాల్లో విహరిస్తూ అలసి పోయిన ఉత్సవ మూర్తులకు వేద పండితులు నవకళశ స్థాపన (108 కళశాలు)తో పంచామృతాభిషేకం, ప్రాయశ్చిత్య లఘు సంప్రోక్షణ హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారిని నూతన పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రహ్లాదవరుడితో పార్వేటలో పాల్గొన్న జ్వాల నరసింహ స్వామి ఉత్సవ విగ్రహాన్ని సాయంత్రం పల్లకీలో ఎగువ అహోబిలానికి చేర్చారు. ఈ పూజలు ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సామ్యానారాయణ్, జీపీఏ సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



అహోబిలం చేరుకున్న ఉత్సవ పల్లకీకి స్వాగతం పలుకుతున్న అహోబిలం పీఠాధిపతి



శ్రీ జ్వాల, ప్రహ్లాదవరద స్వాములకు తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు ఎగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు శనివారం ఎగువ అహోబిలంలో అంకుర్పాణతో మొదలై మార్చి 9వ తేదీ వరకు ఘనంగా కొనసాగుతాయి. దిగువ అహోబిలంలో ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్చి 4న ఎగువలో, 5న దిగువ అహోబిలంలో కల్యాణోత్సవాలు, 6న ఎగువలో, 7న దిగువలో రథోత్సవాలు, 7న ఎగువలో, 8న దిగువలో గరుడోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలను తిలకించేందుకు దేశంలోని నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ఆదోని డివిజన్‌కు చెందిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాముడుకు పదోన్నతి లభించింది. ఆయనను తూర్పుగోదావరి జిల్లా జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా బదిలీ చేస్తూ కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. కాగా జిల్లాలో ఆదోనితో పాటు కర్నూలు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. కర్నూలు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు నంద్యాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

నేడు ఐసీడీఎస్ పీడీల సమావేశం

కర్నూలు(రాజ్‌విహార్): స్త్రీ, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) జిల్లాధికారుల (పీడీల) సమా వేశం శనివారం నిర్వహించనున్నట్లు కర్నూ లు జిల్లా ఐసీడీఎస్ పీడీ కేఎల్‌ఆర్‌కే కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ.క్యాంప్‌లోని కర్నూ లు అర్బన్ సీడీపీఓ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పీడీలు, సీడీపీఓలు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు.

రథోత్సవం తిలకిస్తుండగా కూలిన మిద్దె

● 11 మందికి గాయాలు ● ఇద్దరి పరిస్థితి విషమం




గాయపడిన మహిళలు

ఆలూరు రూరల్/హొళగుంద: ఆలూరు మండలం గూళ్యం గ్రామంలో గాదిలింగప్ప తాత రథోత్సవాన్ని సత్రం మిద్దెపై నుంచి తిలకిస్తుండగా అపశ్రుతి చోటుచేసుకుంది. శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో ఒక్కసారిగా మిద్దె కూలడంతో 11 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో హొళగుంద గ్రామానికి చెందిన హనుమంతమ్మ, మంగమ్మ, చంద్రమ్మ, మంజమ్మ, కర్ణాటక రాష్ట్రం అగసనూరుకు గ్రామానికి చెందిన గౌరమ్మ, పద్మ, రాధిక, నాడంగ గ్రామానికి చెందిన యంకమ్మ, రారావి గ్రామానికి చెందిన పవిత్ర, ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామానికి చెందిన నాగమ్మ ఉన్నారు. క్షతగాత్రులను 108 వాహనాల్లో హొళగుంద పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించారు. హనుమంతమ్మ, చంద్రమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు బళ్లారి ఆస్పత్రికి రెఫర్ చేశారు. అలాగే బాలికలు రాధిక, పవిత్రలను కూడా చికిత్స నిమిత్తం బళ్లారికి తరలించారు. హాలహర్వి మండల తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీఓ ఆంటోని, ఎస్‌ఐ విజయ్ కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించారు. పాత మిద్దెపై దాదాపు 50 మందికు పైగా భక్తులు రథోత్సవాన్ని తిలకించేందుకు ఎక్కడంతో కూలిందన్నారు. ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో గ్రామస్తులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



కూలిన సత్రం మిద్దె

‘ఉపాధి’లో అక్రమాలకు చెక్!

● పారదర్శకతకు పెద్దపీట
● ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో మస్టర్
● ఆధార్ అనుసంధానంతో వేతనాల చెల్లింపు



గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో ఉపాధి పనులకు హాజరైన కూలీలు (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఒకప్పుడు అక్రమాలు ఎక్కువగా ఉండేవి. పనులకు హాజరు కాకపోయినా మస్టర్ (హాజరు) వేసి ఉపాధి నిధులను కొల్లగొట్టేవారు. టీడీపీ హయాంలోఉపాధి సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కుమ్మక్కై 80 నిధులను స్వాహా చేశారు. కేవలం 20 శాతం మాత్రమే పేదలకు ఖర్చు చేశారు. ఈ విషయాలు సామాజిక తనిఖీల్లో వెల్లడయ్యాయి. దీంతో ప్రస్తుత ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంది. అక్రమాలకు తావు లేకుండా పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందుకోసం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్‌ఎంఎంఎస్)ను అమలు చేస్తోంది. ఆధార్ అనుసంధానంతో కూలీలకు వేతనాల చెల్లించేలా చర్యలు తీసుకుంది. అధికారులు ఏరియా ఆఫీసర్ యాప్ ద్వారా ముమ్మరంగా తనిఖీలు చేస్తుండడంతో అక్రమాలకు చెక్ పడింది.

పక్కాగా మస్టర్

గతంలో ఉపాధి పనులకు వచ్చే కూలీలకు మాన్యువల్‌గా మస్టర్ వేసేవారు. ఉపాధి పనికి 15 మంది హాజరైతే 50 మందికి మస్టర్ వేసేవారు. ఈ అక్రమాలను నివారించేందుకు ఎన్ఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లోనే మస్టర్ వేస్తున్నారు. ప్రతి రోజు రెండు సార్లు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో మస్టర్ వేయడంతో పాటు కూలీల ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. మస్టర్‌లో 10 మంది కూలీల హాజరు ఉంటుంది. ఒక పనికి 25 మంది వస్తే మూడు మస్టర్లు వేస్తారు. మస్టర్‌లో ఎంతమంది హాజరు ఉంటే అంతమంది కనిపించే విధంగా ఫొటో తీయాలి. ఉదయం 7 గంటలకు మస్టర్ వేసి ఫొటో అప్‌లోడ్ చేసిన 4 గంటల తర్వాత మరోసారి మస్టర్ వేసి.. కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. మస్టర్‌కు, ఫొటోలో కనిపించే కూలీలకు తేడాలు వస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు. ప్రతి రోజు రెండుసార్లు ఎన్‌ఎంఎంఎస్‌లో మస్టర్ వేసి ఫోటోలు అప్‌లోడ్ చేస్తేనే కూలీలకు వేతనాలు లభిస్తాయి.

బినామీలు లేకుండా..

గతంలో జాబ్‌కార్డు కలిగిన వ్యక్తి ఏ బ్యాంక్ అకౌంటు నంబరు ఇచ్చినా అందులో కూలీల వేతనాలు వేసేవారు. దీంతో బినామీలు బాగా లబ్ధిపొందే వారు. ఇపుడు ఆధార్ అనుసంధానంతో వేతనాలు ఇస్తున్నారు. ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉన్నపుడు చివరిలో ఏ బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం అయిందో ఆ ఖాతాకు వేతనాలు జమ అవుతాయి. జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో అక్రమాలు తొలగిపోయాయి.

పద్బందీగా తనిఖీలు

ఉపాధి పనులను జిల్లా కలెక్టర్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, ఎంపీడీవోలు(పీవో) తనిఖీలు చేయాల్సి ఉంది. ప్రతి నెలా ఎంపీడీఓ 15, ప్రాజెక్టు డైరెక్టర్ 10, జిల్లా కలెక్టర్ 10 వర్క్‌లను ర్యాండమ్‌గా తనిఖీ చేయాల్సి ఉంది. వీరు తనిఖీల్లో ప్రధానంగా మస్టర్‌ను పరిశీలిస్తారు. తనిఖీ చేసిన అంశాలను ఏరియా ఆఫీసర్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఉపాధిలో పారదర్శకత కోసమే ప్రభుత్వం ఏరియా ఆఫీసర్ యాప్‌ను రూపొందించింది.

అక్రమాలు తగ్గిపోయాయి



ఉపాధి హామీ పథకంలో అక్రమాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఎన్‌ఎంఎంఎస్ హాజరు ఆధారంగానే కూలీలకు వేతనాలు లభిస్తున్నాయి. బినామీలు, అనర్హులు లబ్ధిపొందే అవకాశం ఎంత మాత్రం లేదు. విస్తృతంగా తనిఖీలు చేస్తూ ఏరియా ఆఫీసర్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం.
– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

ప్రేమ పేరుతో బాలిక కిడ్నాప్

● యువకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వెల్దుర్తి: ప్రేమ పేరుతో బాలికను కిడ్నాప్ చేసిన యువకుడి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రామళ్లకోటకు చెందిన మనోహర్ తన గ్రామానికే చెందిన 17 ఏళ్ల బాలికకు ప్రేమపేరుతో దగ్గరయ్యాడు. గురువారం ఉదయం అమ్మాయికి మాయమాటలు చెప్పి నమ్మించి బైక్‌పై ఉడాయించి తీసుకెళ్లాడు. అమ్మాయి తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ కేసుగా నమోదు చేసుకుని ఎస్‌ఐ ముమ్మర విచారణ ప్రారంభించారు. ఇది తెలుసుకుని భయపడిన మనోహర్ తిరిగి ఆ అమ్మాయిని శుక్రవారం వారి ఇంటి వద్ద చేర్చి తన ఇంటికెళ్లాడు. ఇంటి వద్ద ఉన్న మనోహర్‌ను అరెస్ట్ చేసి, అతడు ఉపయోగించిన బైక్‌ను పోలీసులు సీజ్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎల్లమ్మగుట్ట తండా సర్పంచ్ మృతి



ఎల్లిభాయ్ (ఫైల్)

తుగ్గలి: మండల పరిధిలోని ఎల్లమ్మగుట్టతండా సర్పంచ్ ఎల్లిభాయ్ (70) శుక్రవారం మృతి చెందారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఈమెను చికిత్స నిమిత్తం మూడు రోజుల క్రిందట కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమెకు నలుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. 2021 ఫిబ్రవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కొత్తగా ఏర్పడిన ఎల్లమ్మగుట్ట తండా పంచాయతీ నుంచి సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ మద్దతుదారుగా ఈమె విజయం సాధించారు. ఈమె మృతి పట్ల పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వివిధ గ్రామాల సర్పంచులు సంతాపం తెలిపారు.

అద్దంకి వాసి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవికుమార్

బనగానపల్లెరూరల్: అప్పలాపురం–టంగుటూరు గ్రామాల మధ్యలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాపట్ల జిల్లా అద్దంకి వాసి దుర్మరణం చెందాడు. నందివర్గం ఎస్‌ఐ రామాంజినేయరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణానికి చెందిన తాపీ మేస్త్రీ జి.రవికుమార్(39) అనంతపురం పట్టణంలో బిల్డింగ్ పనులు చేపట్టాడు. శుక్రవారం సొంతూరు నుంచి బైక్‌పై అనంతపురానికి వెళ్తుండగా టంగుటూరు –అప్పలాపురం గ్రామాల మధ్య బనగానపల్లె వైపు నుంచి వేగంగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవికుమార్‌ను స్థానికులు బనగానపల్లె వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి వద్ద లభించిన ఫోన్ ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందజేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీతోపాటు ఇద్దరు సంతానం ఉన్నారు.

విద్యుత్ ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని అధికారులను దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి హెచ్చరించారు. శుక్రవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా విద్యుత్ అధికారులతో మాట్లాడారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిచడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు పనిచేసే ప్రాంతంలో నివాసం ఉండాలని, అప్పుడే అంతరాయ సమస్యలు, ఫిర్యాదులు తగ్గుతాయని చెప్పారు. విద్యుత్ బిల్లుల వసూలుపై దృష్టి సారించి, 100 శాతం రాబట్టాలని సూచించారు.

కన్న తండ్రే కాలయముడు

● అల్లుడితో విభేదించి పుట్టింటికి వచ్చిన కుమార్తె
● నచ్చజెప్పినా వినకపోవడంతో గొంతు నులిమి హత్య
● తల, మొండెం వేరు చేసి నల్లమల లోయలో పడేసిన వైనం
● 15 రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన ఘాతుకం

పాణ్యం: అత్తింటి నుంచి విభేదించి పుట్టింటికి వచ్చిన కుమార్తెను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన తండ్రే దారుణంగా హత్య చేశాడు. తల్లి లేని బిడ్డను ఆదరించాల్సిన నాన్ననే ఘాతుకానికి పాల్పడ్డాడు. చెప్పిన మాట వినడం లేదని చంపేసి, మృతదేహాన్ని ఎవరూ గుర్తించకుండా తల, మొండెం వేరు చేసి నల్లమల లోయలో పడేశాడు. నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఆలమూరు గ్రామంలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆలమూరు గ్రామానికి చెందిన దేవేంద్రారెడ్డికి ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె ప్రసన్న (21)ను రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా పని చేసే జిల్లెల్ల గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. కాగా కొద్ది నెలలకే ప్రసన్న తన భర్తతో విభేదించి పుట్టింటికి చేరుకుంది. పలుమార్లు పెద్ద మనుషులు, బంధువుల సమక్షంలో పంచాయితీ చేసి నచ్చజెప్పినా మెట్టినింటికి వెళ్లేందుకు ఒప్పుకోలేదు. ఈనెల 10వ తేదీన రాత్రి దేవేంద్రారెడ్డి మరోసారి కుమార్తెను బుజ్జగించే ప్రయత్నం చేశాడు. అయితే తాను వెళ్లనని ఆమె తెగేసి చెప్పింది. దీంతో కోపోద్రిక్తుడైన దేవేంద్రారెడ్డి ప్రసన్న గొంతు నులిమి చంపేశాడు. అనంతరం మృతదేహాన్ని మాయం చేసేందుకు కొందరి సాయంతో వాహనంలో నంద్యాల – గిద్దలూరు ఘాట్‌రోడ్డులో అటవీ ప్రాంతానికి తరలించారు. అయితే మృతదేహాన్ని ఎవరూ గుర్తు పట్టకుండా తల, మొండెం వేరు చేసి వేర్వేరు చోట్ల పడేసి ఏమి తెలియదన్నట్లుగా ఇంటికి చేరుకున్నారు.



ప్రసన్న (ఫైల్)

తాత ఫిర్యాదుతో వెలుగులోకి..

దేవేంద్రారెడ్డి మొదటి భార్యది వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం సుంకేసుల గ్రామం. ఆమె ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. కుమార్తె ప్రసన్నను తండ్రి దేవేంద్రారెడ్డి చదివించిపెళ్లి చేశాడు. ఇటీవల ఆయన రెండో వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో మెట్టినింటి నుంచి అలిగి వచ్చిన కుమార్తె పెద్దల మాట వినకపోవడంతో చంపేసి మృతదేహాన్ని అడవిలో పడేసి వచ్చాడు. అయితే పది రోజులుగా మనువరాలు ఆచూకీ లేకపోవడంతో పెద్దముడియం మండలం సుంకేసులకు చెందిన తాత శివారెడ్డి అనుమానించాడు. అల్లుడు దేవేంద్రరెడ్డిని నిలదీయగా పొంతన లేని సమాధానం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దేవేంద్రరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా కుమార్తెను చంపి మరికొందరి సహకారంతో ఎవ్వరికీ అనుమానం రాకుండా నల్లమల్ల ఫారెస్టులోని బొగద వద్ద పడేసినట్లు చెప్పాడు. పోలీసులు అడవిలో రెండు రోజులుగా గాలించి శుక్రవారం సాయంత్రం 300 అడుగుల లోయలో ఉన్న ప్రసన్న తల, మొండాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దేవేంద్రారెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. అయితే ప్రసన్న కాపురానికి వెళ్లకపోవడానికి ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు తేల్చారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

ప్రమాదవశాత్తూ శిల్పకారుడి మృతి



రవీంద్ర (ఫైల్)

ఆలూరు రూరల్: ఆలయ నిర్మాణంలో భాగంగా రాతి దూలం చెక్కుతున్న శిల్పకారుడు రవీంద్ర (24) ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఆలూరు మండలం తుంబళబీడు గ్రామానికి చెందిన రవీంద్ర గుడి నిర్మాణాలకు శిల్పాలు చెక్కే పనిచేస్తున్నాడు. ఇందులో భాగంగానే ఆలూరు కోట వీధిలో సుంకలమ్మ ఆలయం నిర్మాణానికి రాతి దూలం సిద్ధం చేస్తుండగా బ్లేడు తెగి కుడికాలి తొడలో గుచ్చుకోవడంతో నరాలు తెగిపోయాయి. క్షతగాత్రుడిని కర్నూలుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

వివాహిత ఆత్మహత్య

పాములపాడు: అత్తామామలు మందలించారని ఓ వివాహిత మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మిట్టకందాలకు చెందిన సురేష్‌రెడ్డితో ఉయ్యాలవాడ మండలం అల్లూరు గ్రామానికి చెందిన తేజస్వీని(28)కి ఆరేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబంలో తలెత్తిన విభేదాలతో సంసారం బాగా చేసుకోవాలని అత్త మామలు మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పంచాయతీల్లో 27న ఓటరు జాబితా ప్రచురణ

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ గ్రామ పంచాయితీల్లో ఖాళీగా ఉన్న సర్పంచు, వార్డు మెంబర్ల స్థానాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 27వ తేదీన ఆయా గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాలను ప్రచురించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి 1న ప్రచురించిన ఓటరు జాబితా ఆధారంగా ఈ జాబితాలను రూపొందించినట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో కొతాళం మండలం బదినేహాల్ గ్రామ సర్పంచు పదవితో పాటు వివిధ మండలాల్లో 36 వార్డు మెంబర్ల స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే నంద్యాల జిల్లాకు సంబంధించి అవుకు మండలం అన్నవరం, ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు, కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లి సర్పంచు స్థానాలతో పాటు 41 వార్డు మెంబర్ల స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే ఖాళీగా ఉన్న ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి మార్చి 2వ తేదీన ఓటరు జాబితాలను ప్రచురిస్తామని చెప్పారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి, కాల్వ -1, కర్నూలు మండలం ఆర్ కొంతలపాడు, కృష్ణగిరి మండలం ఆలంకొండ, పత్తికొండ మండలం చిన్నహుల్తి, ఆలూరు మండలం ఆలూరు -5, ఎమ్మిగనూరు మండలం బనవాసి, కొతాళం మండలం బదినేహాల్, గుడికంబాలి ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు. నంద్యాల జిల్లాలోని జూపాడుబంగ్లా మండలం తాటిపాడు, తర్తూరు, కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్



గూడూరు: మండలంలోని జూలకల్లులో ఈ నెల 7న ఓ యువతిపై జరిగిన అత్యాచారం కేసులో అదే గ్రామానికి చెందిన గోకారి తరుణ్‌ను అరెస్ట్ చేసినట్లు కోడుమూరు సీఐ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిందితుడిపై కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుచగా రిమాండ్‌కు ఆదేశించారన్నారు. సమావేశంలో ఎస్‌ఐ నరేంద్ర పాల్గొన్నారు.